క్లుప్తంగా

నేడు గృహ సారథులకు శిక్షణ

పెనుకొండ: పట్టణంలోని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ క్యాంప్ కార్యాలయంలో సోమవారం మావటూరు, నాగలూరు, అడదాకులపల్లి, శెట్టిపల్లి, రాంపురం, గోనిపేట పంచాయతీల గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ ఉంటుందని సచివాలయ కన్వీనర్ శ్యామనాయక్ ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు, సలహాలు అందించనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచులు, పార్టీ ముఖ్యనాయకులు ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

ఆధ్యాత్మిక గ్రంథాల ప్రదర్శన



ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు మహాశివరాత్రి జాగరణ సందర్భంగా ఆధ్యాత్మిక గ్రంథాల ప్రదర్శన నిర్వహించారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో హిందూధర్మానికి చెందిన 100 గ్రంథాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి సభ్యులు ఆదెప్పశెట్టి, ప్రభాకర్, రమేష్‌బాబు, శివకుమార్, లక్ష్మీ నరసింహ, నాగరాజు, శీనప్ప తదితరులు పాల్గొన్నారు.

23న భజన మండలి రజతోత్సవం

రొద్దం: మండలంలోని నల్లూరులో ఈనెల 23 సత్యసాయి భజన మండలి రజతోత్సవం నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవాసమితి సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నల్లూరులో సత్యసాయి భజన మండలి 25 ఏళ్లు పూర్తి చేసుకోవడంతో రజతోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సత్యసాయి సేవాసమితి రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు హాజరు కానున్నట్లు వివరించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

గుడిబండ: మద్దనకుంట గ్రామంలో కరియమ్మ ఆలయ నిర్మాణానికి మండలంలోని పి.సి.గిరి గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త జయరామిరెడ్డి ఆదివారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మడకశిర(అగళి): మండలంలోని వివిధ గ్రామాలకు బైక్‌లో ఆదివారం కర్ణాటక మద్యం పాకెట్లను తరలిస్తున్న మధూడికి చెందిన నరసింహమూర్తి అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్‌ఐ లావణ్య తెలిపారు. నిందితుడి నుంచి 100 టెట్రా కర్ణాటక పాకెట్లను స్వాధీనం చేసుకుని బైక్‌ను సీజ్ చేశామన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

హిందూపురం టౌన్: ముద్దిరెడ్డిపల్లిలోని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రచారం నిర్వహించారు. ఆదివారం మండలంలోని మణేసముద్రం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గ్రంథాలను అందజేశారు కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఆదినారాయణ, సభ్యులు తిమ్మప్ప, శేఖర్, మునీంద్ర, హేమంత్, గణేష్, సుభద్ర, కలక్క, సుజాత, లీలక్క, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నిత్యనారాయణ సేవ వార్షికోత్సవం

హిందూపురం: స్థానిక పాండురంగ నగర్‌లోని సత్యసాయి సేవామందిరంలో మహాశివ రాత్రి సందర్భంగా నిత్యనారాయణ సేవ దశమ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి పుట్టపర్తి సత్యసాయి బాబాకు పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా ఆర్గనైజన్ సభ్యులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు

లేపాక్షి: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని లేపాక్షిలో ఆదివారం జరిగిన బ్రహ్మ రథోత్సవానికి ఆంధ్ర, తెలంగాణా, కర్ణాటక నుంచి భారీగా భక్తులు విచ్చేసారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన అన్న దాన సత్రంలో అన్నదానం చేపట్టారు. అలాగే మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. కాలువపల్లికి చెందిన ప్రసాద్ 4 వేల వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అదేవిధంగా నంది వినాయక సేవాసమితి, ఎస్సీ కాలనీలో సెంట్రింగ్ రమేష్, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు జైకిషన్, గొంగటిపల్లి మదన్‌మోహన్, మాజీ మంత్రి గాజుల సోమశేఖర్ జ్ఞాపకార్థం అన్నదానం చేపట్టారు. డాక్టర్ గోపిచంద్ కుటుంబ సభ్యులు వాటర్ ప్యాకెట్లు, లారీ శ్రీరామప్ప, ఎల్ఐసీ చంద్రశేఖరరెడ్డి మిత్ర బృందం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పానకం పంపిణీ చేశారు.

కమనీయం.. కల్యాణోత్సవం



నీలకంఠాపురంలో గిరిజా కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



అమరాపురంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మడకశిరరూరల్: నీలకంఠాపురంలో వెలిసిన నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ రఘువీరారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా గిరిజా కల్యాణోత్సవం నిర్వహించారు. అర్చకులు ఉదయం నుంచి స్వామికి విశేష పూజలు చేపట్టారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి శివుడు, పార్వతీదేవికి గిరిజా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి వార్లను ఆలయ మాడవీధుల్లో పాకారోత్సవం చేపట్టారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులకు ప్రసాద వినియోగం చేశారు.

వైభవంగా శివపార్వతుల కలాణోత్సవం

అమరాపురం: స్థానిక కోట వీధిలో వెలసిన కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తెల్లవారు జామున 2 గంటల నుంచి శివ పార్వతుల కలాణోత్సవాన్ని అర్చకులు అశ్వర్ధనారాయణ శాస్త్రి,, భాస్కర్ శాస్త్రి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివ పార్వతుల ప్రతిమలకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున శివ పార్వతులకు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుబ్రమణ్యశాస్త్రి, శ్రీనివాసమూర్తి, హరినాథ్, భక్తులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణోత్సవం

గోరంట్ల: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక పురాతన శివాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య శివపార్వతుల కల్యాణోత్సవం జరిపించారు. మండలంలోని కొండాపురంలోని వేణుగోపాలస్వామి ఆలయం, గుమ్మయ్యగారిపల్లిలోని మారెమ్మ ఆలయాల్లో శివ పార్వతుల కల్యాణోత్సవం జరిగింది.



గుమ్మయ్యగారిపల్లిలోని మారెమ్మ గుడిలో శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నదృశ్యం

ఘనంగా శివరాత్రి ఉత్సవాలు



బ్రహ్మకుమారీ ఈశ్వరీ విద్యాలయం వద్ద శివలింగాల ప్రదర్శన



చిన్నారుల వేషధారణ కార్యక్రమంలో చైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్ అయిూబ్

హిందూపురం: హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. హిందూపురం పట్టణంలోని త్యాగరాజనగర్‌లోని రాతి శివాలయంలో ప్రత్యేక పూజలు శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకూ సాగాయి. అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో వందలాది భక్తజన మధ్య రుద్రా, పంచామృతాభిషేకాలు నిర్వహించి విశేష పూజలు నిర్వహించారు. శివరాత్రి జాగరణ కార్యక్రమానికి ప్రత్యేక సంగీత విభావరి ఏర్పాటుచేశారు. అలాగే మేళాపురం, శ్రీకంఠపురం శివాలయాల్లో లింగోద్భవం తర్వాత పార్వతీ పరమేశ్వరుడి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి ప్రత్యేకపూజలు చేసి కల్యాణోత్సవాలు నిర్వహించారు. పులమతిరోడ్డులోని మాత రాజరాజేశ్వరీ ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. మోడల్ కాలనీలో జలకంఠేశ్వర గంగమ్మదేవాలయంలో బెస్త సంఘం ఆధ్వర్యంలో పూజలు, అన్నదానం చేశారు. ఆలయ ఆవరణలో బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆర్కెస్ట్రా, హాస్యవల్లరి కార్యక్రమాలు చేపట్టారు. అదేవిధంగా బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా చైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్ ఆయుబ్‌లతోపాటు పట్టణ ప్రముఖులు హాజరైయ్యారు.

మూర్ఛ వ్యాధిగ్రస్తులు అపోహలు వీడాలి



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రామ్మూర్తి

హిందూపురం: మూర్ఛ వ్యాధిగ్రస్తులు అపోహలు వీడి దీర్ఘకాలికంగా మందులు వినియోగిస్తూ వైద్యుల సలహాలు పాటిస్తే వ్యాధి నయమవుతుందని ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ గోపాళం శివనారాయణ, డాక్టర్ ఈటీ రాంమూర్తి సూచించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆల్‌హిలాల్ స్కూల్‌లో ఉచిత మూర్ఛవ్యాధి చికిత్స శిబిరం జరిగింది. ఈసందర్భంగా రోగులను పరీక్షలు చేసి రెండునెలలకు సరిపడే మందులు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో జేవీవీ సభ్యులు రామకృష్ణ, అతావుల్లా, ఉగ్రప్ప, శ్రీనివాసులు, నాగేంద్రచారి, లక్ష్మీపతి, మురళీమోహన్, నాగరాజుగుప్త, ప్రభాకర్, సుబ్రమణ్యనాయక్, మంజునాథ, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు ప్రాధాన్యత ఇవ్వాలి



విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్థానిక మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప పిలుపునిచ్చారు. స్థానిక పి రొప్పం గ్రామంలో బెంగళూరుకు చెందిన ఠి లైఫ్ హాస్పిటల్, సేవాస్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల కు బీపీ, షుగర్ వ్యాధుల రక్త పరీక్షలు నిర్వహించి సరైన చికిత్స అందించాలన్నారు. ఈ సందర్భంగా చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన వందలాది మంది రోగుల కు వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన పది, పీయూ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. మున్సిపల్ మాజీ అధ్యక్షుడు మానం వెంకటస్వామి, చిన్న మల్లప్ప, సొగడు వెంకటేశ్, జయంత్, వైద్యులు శివానంద, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

శివాయంలో ప్రత్యేక పూజలు



రొద్దం రుద్రపాద శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానది ఒడ్డున వెలసిన రుద్రపాద ఆశ్రమంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. మహా శివరాత్రి సందర్భంగా జాగారణ చేసిన భక్తులకు శివాలయాల్లో తీర్థప్రసదాలు అందించారు.


కశ్యప మహర్షి విగ్రహ పునఃప్రతిష్ట



కశ్యప మహర్షి విగ్రహాన్ని పునఃప్రతిష్టిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం సమీపంలో పాత జాతీయ రహదారి వద్ద ఆదివారం జరిగిన కశ్యప మహర్షి విగ్రహ పునఃప్రతిష్టలో ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పాల్గొన్నారు. గతంలో డివిజన్ పంచాయతీ రాజ్ కార్యాలయం వద్ద ఉన్న కశ్యప మహర్షి విగ్రహం రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించారు. రోడ్డు పనులు పూర్తి కావడంతో డివైడర్ మధ్యలో విగ్రహాన్ని పునఃప్రతిష్టించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ తన చేతుల మీదుగా విగ్రహాన్ని పునఃప్రతిష్టించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ బోయన రసింహ, వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, ముఖ్యనాయకులు శంకరరెడ్డి, కొండలరాయుడు, నాయుడు, రేవటి గణేష్, ఫరీద్, బోయబాబు, సూరి, క్రిష్టప్ప, ఆర్యవైశ్య పెద్దలు, పట్టణ వాసులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సిద్దేశ్వరస్వామి ఆలయంలో..



అలంకరణలో సిద్దేశ్వరస్వామి

రొళ్ల: టీడీ పల్లి గ్రామ సమీపాన అటవి ప్రాంతంలో వెలసిన సిద్దేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి మూలవిరాట్‌ను గంగాజలంలో శుద్ధి చేసి అభిషేకించారు. తర్వాత వెండి ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి మహామంగళారతి చేశారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు వంటకాలు చేసి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

తాజ్‌బాబా కారుకు ప్రమాదం

పెనుకొండ రూరల్: పెనుకొండ దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా కారుకు ఆదివారం ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. తాజ్‌బాబా తన కారులో పెనుకొండ నుంచి అనంతపురం వెళ్తుండగా, హరిపురం జైజంక్షన్ స్పీడ్ బ్రేకర్ల వద్దకు రాగానే వేగాన్ని నియంత్రించారు. అదే సమయంలో వెనుకవైపునే వస్తున్న టాటాఏస్ గూడ్స్ వాహనం వెనుకవైపు నుంచి ఢీకొనింది. దీంతో తాజ్‌బాబా కారు పాక్షికంగా దెబ్బతినింది. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ట్రాఫిక్ నియంత్రించారు.

కాడు గొల్లలను ఎస్టీల్లోకి చేర్చండి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కాడు గొల్ల నాయకులు

పావగడ: కాడు గొల్లలను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని జిల్లా కాడు గొల్లల సంఘం అధ్యక్షుడు గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాలూకాలోని వీర్లగొంది గ్రామంలో ఆదివారం నిర్వహించిన 'కాడు గొల్లల నడిగె ఎస్టీ పోరాటం దాకె జాగృతి అభియాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 1931 క్రితమే మైసూరు సంస్థానంలో కాడుగొల్లల సమాచారం దాఖలాలు ఉన్నాయని, 2018 లో సిద్ధరామయ్య హయాంలో జాతి జాబితాలోకి చేర్చడం మినహా అప్పటి నుంచి పూర్తి నిర్లక్ష్యానికి గురి కావడం శోచనీయమన్నారు. ప్రతి ఒక్క కాడు గొల్లలు రెవెన్యూ శాఖ లో కాడు గొల్ల అని కుల ధ్రువీకరణ పత్రం తప్పని సరిగా పొందాలన్నారు. కాడు గొల్ల కులస్తులందరూ ఎస్టీ పోరాటానికి మద్దతు పలకాలన్నారు. కాడు గొల్లల సంఘం రాష్ట్ర నాయకుడు నందీశ్ మాట్లాడుతూ 8 సంవత్సరాల క్రితమే సిద్ధరామయ్య హయాంలో కాడు గొల్లలకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలన్న నివేదిక రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిందని అయితే స్థానిక ఎంపీ నారాయణస్వామి నిర్లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక నేటికీ అందలేదన్నారు. ఎన్నికల్లోగా నివేదిక పార్లమెంట్‌లో పెట్టకుంటే వచ్చే ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. పీడబ్ల్యూడీ ఏఈఈ సిద్ధప్ప, రమేశ్, శివకుమార్, పాపణ్ణ, ముగదాళబెట్ట నరసింహయ్య, నాగేంద్రప్ప, బోరణ్ణ, శివణ్ణ, గోపాల్,శివణ్ణ, శివకుమార్, తేజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి యువకుడికి గాయాలు

గోరంట్ల: స్థానిక ఎల్లమ్మ గుడి సమీపంలో ఆదివారం గంగంపల్లి – గోరంట్ల ప్రధాన రహదారిపై ఆటో బోల్తాపడింది. ఆటో డ్రైవర్ వినాయకనగర్‌కు చెందిన మహమ్మద్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. మహమ్మద్ అనేయువకుడు ఆటోను నేర్చుకోవడానికి గంగంపల్లి వైపు తీసుకెళ్లాడు. ఈక్రమంలో అదుపు తప్పి రోడ్డుపై బోల్తాపడింది. ఘటనలో మహమ్మద్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన మహమ్మద్‌ను గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మిత్రుడి కుమార్తెకు చేయూత

పరిగి: మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన గోపాల్ కుమార్తె నీలావతి విద్యాభ్యాసానికి తన క్లాస్‌మేట్ డాక్టర్ కిరణ్ రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. 1991–92 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన గోపాల్, కిరణ్, మహమ్మద్‌గౌస్ చిన్నప్పటి నుంచి కలిసి మెలిసి చదువుకున్నారు. ఎంఎ టీపీటీ చదివిన గోపాల్ అనారోగ్యంతో పదేళ్లక్రితం చనిపోయాడు. అతని కుటుంబానికి అండగా నిలవాలన్న ధ్యేయంతో మిత్రుడి కుమార్తె నీలావతి చదువుకు ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకూ ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చును మహమ్మద్ గౌస్ భరిస్తున్నారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని నీలావతికి ఆర్థిక కష్టాలను అమెరికాలో ఉండి తోటి మిత్రుల ద్వారా తెలుసుకున్న డాక్టర్ కిరణ్ తన వంతుగా రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు.

నేడు అగ్నిగుండ మహోత్సవం

అమరాపురం: హేమావతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అగ్నిగుండ మహోత్సవం జరుగనున్నట్లు ఆలయ ఈఓ నాగేంద్రప్రసాద్‌రావు, చైర్మన్ మంజునాథ తెలిపారు. ఈ ఉత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తుండడంతో ఎలాంటి అసౌకర్యం కలగకుండా బారికేడ్లను ఏర్పాటు చేశామన్నారు. మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి సోమవారం ఉదయం 8 గంటలకు అగ్నిగుండ మహోత్సవాన్ని ప్రారంభిస్తారన్నారు. ఇదిలా ఉండగా సర్పంచ్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. దాతలు తాగునీరు, మజ్జిగ, పానకం, పెసర బేడలు, సిద్దేశ్వరస్వామి అన్నదాసోహ కేంద్రంలో భక్తులకు ఉదయం నుంచి సాయంకాలం వరకూ అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇదిలా ఉండగా మడకశిర డిపో, అమరాపురం నుంచి హేమావతికి 10 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామని ఇంచార్జ్ డీఎం హంపన్న తెలిపారు. మడకశిర గుడిబండ, హేమావతికి 4 ప్రత్యేక సర్వీసులు, మడకశిర, జంబులబండ మీదుగా హేమావతికి మరో 4 సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు.

వైభవంగా భాను పల్లకీ ఉత్సవం



స్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

అమరాపురం: హేమావతి సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం భాను పల్లకీ ఉత్సవాన్ని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వామికి అర్చకుడు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళహారతి చేశారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు. అనంతరం ఆలయ ఆవరణం నుంచి మేళతాళాలతో గ్రామవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు ఉత్సవ కమిటీ చైర్మన్ మంజునాథ, ఈఓ నాగేంద్రప్రసాద్‌రావు, సర్పంచ్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో తాగునీటి వసతి కల్పించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



పెనుకొండలో శివాజీ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న మరాఠా కులస్తులు



హిందూపురంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ముస్లిం నగారా అధ్యక్షుడు ఉమర్‌ఫారూక్ ఆధ్వర్యంలో స్థానిక సద్భావన సర్కిల్‌లో ఆదివారం శివాజీ చిత్రపటం వద్ద హిందూ, ముస్లింలు వేడుకలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, న్యాయవాది శివశంకర్, కౌన్సిలర్ ఆసీఫ్‌వుల్లా మాట్లాడుతూ శివాజీ నేటి యువతకు ఆదర్శనీయుడన్నారు. కార్యక్రమంలో న్యాయవాది రామచంద్రప్ప, మల్లికార్జున, ప్రకాష్, ధనుంజయ్, గణేష్, షబ్బీర్, అబ్బుతుల్లా ఖాన్, ఆతీక్, బాబా తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలో ఆదివారం రాత్రి ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను మరాటా కులస్తులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఛత్రపతి చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఉంచి పట్టణ మంతా ఊరేగించారు. పెద్దఎత్తున కోలాహలం నిర్వహించారు.

చిత్రలింగేశ్వరస్వామికి ఘనంగా పూజలు



పూజలు నిర్వహిస్తున్న యాదవులు

అమరాపురం: మద్దనకుంట గ్రామ పొలిమేరలో వెలసిన యాదవ కులస్తుల ఆరాధ్యదైవం చిత్రలింగేశ్వరస్వామికి భక్తులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. వచ్చిన భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. అలాగే యాదవ కులస్తులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతనంగా జీర్ణోద్ధరణ పనులు చేయాలని ఆలయ కమిటీ నిర్ణయించింది.

కాశీ విశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



పెనుకొండలో హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

పెనుకొండ: పట్టణంలోని కాశీ విశ్వేశ్వరాలయంలో ఆదివారం శివరాత్రిని పురస్కరించుకొని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం కాశీ విశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. ఆలయ కమిటీ పెద్దలు ఎమ్మెల్యేతో పాటు ఆయన సతీమణి జయలక్ష్మమ్మను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

చల్లగా చూడు.. కాటికోటేశ్వరా



తాడిమర్రి: మహాశివరాత్రిని పురస్కరించుకుని చిల్లవారిపల్లి కాటికోటేశ్వర క్షేత్రంలో శనివారం ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ముగిశాయి. చిల్లవారిపల్లి గ్రామానికి చెందిన ఆలయ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు కాటికోటేశ్వరసామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శివనామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. చిల్లవారిపల్లి గ్రామం నుంచి తెచ్చిన కాటికోటేశ్వరుడి ఉత్సవ విగ్రహాలు, ఆభరణాలను గదాగుండం దగ్గర కొలువుదీర్చారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవ విగ్రహాలను డప్పుల వాయిద్యాలతో దేవాలయం వరకూ ఊరేగింపు నిర్వహించి, అగ్నిగుండ ప్రవేశం చేయించారు. భక్తులు ముందుగా గదాగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి కాటికోటేశ్వరుడితో పాటు కాశీ నుంచి తెచ్చిన శివలింగానికి, కొండపై గుహలో వెలసిన అక్కమ్మగార్ల దేవతలకు పూజలు చేశారు. ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్ జిల్లాల నుంచి కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు దాడితోట గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముదిగుబ్బ సీఐ కంబగిరి రాముడు తాడిమర్రి, బత్తలపల్లి ఎస్ఐలు డి.లక్ష్మీనారాయణ, టీపీ శ్రీహర్ష సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.